క్లుప్తంగా

స్వర్ణ కిరీటానికి బంగారం విరాళం



అర్చకుడికి బంగారం అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక డీసీసీబీ కాలనీలో వెంచేసిన భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వేంకటేశ్వర స్వామివారికి బంగారు కిరీటం చేయించే నిమిత్తం తమ్మినేని సత్యనారాయణ, రమాదేవి దంపతుల కుమారుడు జ్యోతి స్వరూప్ 5 గ్రాముల బంగారం విరాళంగా అందించినట్లు అర్చకులు గోపాలాచార్యులు బుధవారం తెలిపారు.

ఆలయానికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాత భార్గవ్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతీపేట వద్దనున్న తోటవీధి వినాయక మందిరం పునర్నిర్మాణం కోసం ఒక దాత రూ.50,001లు విరాళంగా బుధవారం అందజేశాడు. నాదెళ్ల నీలాచలం, కృష్ణవేణి దంపతుల జ్ఞాపకార్థం న్యాయవాది నీలాచ భార్గవ్ ఈ సాయాన్ని గ్రామ పురోహితులు పన్నాల నర్సింహమూర్తికి అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్నంది విజయకుమార్, అంధవరపు సుబ్బారావు, తేజోమూర్తుల నాగరాజు, సీహెచ్ సన్యాసిరావు, బాదం మిల్క్ సంతోష్‌లు పాల్గొన్నారు.

ముగిసిన సీసీఈ అకడమిక్ ఆడిట్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 17వ తేదీ నుంచి మొదలైన 2023–24, 2024–25 అకడమిక్ సంవత్సరాల ఆడిట్ బుధవారంతో ముగిసింది. కళాశాలకు వచ్చిన సీసీఈ టీమ్ సభ్యులు పక్కాగా ఆడిట్ చేపట్టారు. ముస్ముందు నాక్ గ్రేడ్ కోసం వెళ్లనున్న కాలేజీలకు సర్వసాధారణంగా సీసీఈ బృందం వచ్చి ఆడిట్ చేపడుతుంటారు. దీనిలో భాగంగానే కళాశాలకు వచ్చినట్లు సీఈఈ బృందం సభ్యులు డాక్టర్ కె.విజయ్‌బాబు, డాక్టర్ టి.జానకిరణ్, ఇ.వరప్రసాద్‌లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు, ఇతర అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినులతో బృందం సభ్యులు వేర్వేరుగా సమావేశమయ్యారు.

అపరిచిత కాల్స్‌పై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జనార్ధన

గార: ప్రతి ఒక్కరూ అపరిచిత ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని గార ఎస్‌ఐ ఆర్.జనార్ధన సూచించారు. మండల పరిధిలోని బలరాంపురం పంచాయతీలో పాఠశాల వద్ద సంకల్పం–2.0 అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఆకతాయి, అల్లరి చేష్టలు చేసే వారిపై దృష్టి సారించాలని తల్లిదండ్రులకు సూచించారు. అపరిచిత వ్యక్తులతో పరిచయం పెంచుకోవద్దని, రుణాలు, బ్యాంకు సిబ్బంది అంటూ ఫోన్లు వస్తే భయపడవద్దన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్కానర్లు అందజేత

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని 28 గ్రామ సచివాలయాలకు స్కానర్లను ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎంపీడీవో బి.మల్లీశ్వరరావు బుధవారం పంపిణీ చేశారు. 225 స్కానర్లను ఎచ్చెర్ల మండలానికి జిల్లా ఉన్నతాధికారులు అందజేశారు. జాగ్రత్తగా స్కానర్లు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి పీవీఎస్ రామ్మోహన్ పాల్గొన్నారు.

అమ్మోజీకి విశిష్ట ఆహ్వానం

రణస్థలం: ఉగాది పురస్కరించుకొని నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నిర్వహిస్తున్న జాతీయ కవి సమ్మేళనానికి జిల్లా నుంచి వర్ధమాన రచయిత్రి అమ్మోజీ బమ్మిడికి ఆహ్వానం అందింది. డైరెక్టర్ మడభూషి సంపత్ కుమార్ బుధవారం ఆహ్వానం పంపించారు. పల్లె జీవన విధానం, వలస బతుకులపై రాసిన 'పల్లె గూటికి పండగొచ్చింది' కవితను ఉత్తమ కవితగా ఎంపిక చేశామన్నారు. మార్చి 28వ తేదీన నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని ప్రాచీన తెలుగు కేంద్రంలో జరిగే కవి సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా జ్ఞాపిక, ప్రశంసపత్రం అందజేసి సత్కరించనున్నారు.

భృతి భ్రాంతియేనా..!

- అమలుకు చర్యలు తీసుకోని ప్రభుత్వం
- ఎదురుచూస్తున్న నిరుద్యోగులు



డిగ్రీ చదువుతున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్:

ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌లో భాగంగా యువతకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం మానేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీ అమలుపై కనీసం దృష్టిసారించడం లేదు. సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి, గద్దెనెక్కిన తర్వాత ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారు. మరోవైపు ఉద్యోగ నోటిఫికేషన్ల విషయం పక్కనబెడితే వలంటీర్ల తొలగింపు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు వంటి చర్యలు తీసుకున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో...

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో 12 వేల మంది వరకు గ్రాడ్యుయేట్లు నిరుద్యోగ భృతికి అర్హులుగా ఉన్నారు. వీరంతా కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారు. రణస్థలం మండలం పైడిభీమవరం పారిశ్రామిక వాడ, ఇతర ప్రాంతాల్లో పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. ఇక్కడ గతంలో స్థానికులకు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యం ఇచ్చేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానికులకు ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకున్నారు. కానీ ప్రస్తుతం స్థానికంగా ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, కెమిస్ట్రీ వంటి సబ్జెక్టులతో డిగ్రీలు పూర్తి చేసినా స్థానికంగా ఉద్యోగాలు లభించడం లేదు.

ఎప్పుడు అమలు చేస్తారు



చాలామంది నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామ వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక వారిని తొలగించారు. రూ.3 వేల నిరుద్యోగ భృతి అనిచెప్పి, కనీసం ఆ మాటే ఎత్తడం లేదు. ఇప్పటికైనా నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి.

– ఎం.స్వాతి, ఎంపీటీసీ, అల్లినగరం

మోసం చేస్తున్నారు



ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చారు. ఇప్పుడేమో వాటిని అమలు చేయకుండా కూటమి నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రధానంగా నిరుద్యోగ భృతిపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుద్యోగులకు భృతి అందజేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– పంచిరెడ్డి రాంబాబు, సర్పంచ్, బొంతలకోడూరు

న్యాయం చేయాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం యువతకు న్యాయం చేయాలి. ఇచ్చిన హామీలు అమలు చేయాలి. నిరుద్యోగ భృతి కోసం యువత ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా విధివిధానాలు ఇంకా ఖరారు చేయకపోవడం సరికాదు. ఇప్పటికైనా అమలుకు చర్యలు తీసుకోవాలి.

– బోర సాయిరాంరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎచ్చెర్ల

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్: ఆపద సమయంలో మనిషి ప్రాణాలను కాపాడేందుకు ప్రథమ చికిత్స ఎంతో అవసరమని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్‌పై 8 రోజుల శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, కో–ఆర్డినేటర్ కె.సత్యనారాయణ, డాక్టర్ శ్రీకాంత్‌లచే ప్రథమ చికిత్సలో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో సీపీఆర్‌పై అవగాహన, విపత్తుల సమయాల్లో గాయాలు, కట్టు కట్టుట, పాముకాటు, తేలు కాటు, గుండె పోటు వచ్చినవారికి ప్రథమ చికిత్స, కరెంట్ షాక్ కొట్టినవారికి, రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారికి ప్రథమ చికిత్స, అలాగే మరికొన్ని అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఎం.కల్యాణ్ చక్రవర్తి, చిన్మయరావు, ఏవో నర్సింగరావు, మేనేజర్ గుణాకరరావు, పి.చైతన్యకుమార్, ఇతర రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్ పరిధిలో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.అప్పయ్య డిమాండ్ చేశారు. ఆర్టీసీ విజయనగరం జోన్ వ్యాప్త కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలతో ధర్నా చేపట్టి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా అనకాపల్లి డిపో ఉద్యోగిని సస్పెండ్ చేశారని, ఈ సస్పెండ్‌ను ఎత్తివేయాలని కోరారు. నర్సీపట్నం డిపో మేనేజర్ వ్యవహరించిన విధానం సంస్థకు నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. మహిళా ఉద్యోగులకు 3 రోజుల సెలవు, చైల్డ్‌కేర్ లీవ్, సిక్ లీవ్‌కు జీతం ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు ఎంఎస్ రావు, బీటీ రావు, వీడీ రావు, జేఆర్ రావు, ఇబ్రహీం, ఎంవీఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టెన్త్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 149 కేంద్రాల్లో బుధవారం జరిగిన హిందీ పరీక్షకు 143 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిశీలకుడు వీఎస్ మస్తానయ్య పలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అలాగే డీఈవో డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పలాస జీహెచ్ స్కూల్, కాశీబుగ్గ జెడ్పీహెచ్ స్కూల్, అంబుగాం కేంద్రాలను పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ లియాకత్, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పలు పరీక్ష కేంద్రాలపై నిఘా పెట్టారు. హిందీ పరీక్షలో ఎలాంటి మాల్ ప్రాక్టీసులు నమోదు కాలేదని డీఈవో స్పష్టం చేశారు.

ఆత్మరక్షణపై దృష్టి సారించాలి



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న సీఐ త్రినేత్రి తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థినులు ఆత్మరక్షణపై దృష్టి సారించి శిక్షణ పొందాల్సిన అవసరం ఉందని శ్రీకాకుళం మహిళ పోలీస్‌స్టేషన్ సీఐ టి.త్రినేత్రి పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్ ప్రయోజనాలు తెలియజేయడంతో పాటు ఆత్మరక్షణ గురించి నిపుణులైన శిక్షకులతో శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలపై దాడులు జరిగే సమయంలో రక్షించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ప్రతీ మహిళకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ప్రతీ విద్యార్థిని మొబైల్‌లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, ఎస్‌ఐ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఈవోగా నరసింహనాయుడు

అరసవల్లి: శ్రీకూర్మం శ్రీకూర్మనాథ స్వామివారి ఆలయ ఈవోగా కె.నరసింహనాయుడును నియమిస్తూ ప్రభుత్వ సెక్రటరీ వినయ్‌చంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు విజయవాడలో ఆర్కియాలజీ, మ్యూజియం శాఖల అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈయనను ఫారెన్ సర్వీస్ కింద డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమించారు. ఇంతవరకు శ్రీకూర్మం ఆలయ ఈవోగా పనిచేసిన గురునాథరావు యథావిధిగా టెక్కలి రావివలస ఎండల మల్లికార్జున స్వామివారి ఆలయ ఈవోగా కొనసాగనున్నారు.


రంగనాథస్వామి కల్యాణోత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేటలో ఉన్న రంగనాథస్వామి ఆలయంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో కల్యాణ ఉత్సవాలకు సేవా ట్రస్ట్ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. మూడు రోజుల పాటు రంగనాథుడు, గోదాదేవి కల్యాణం, రంగనాథుని తిరువీధి, ప్రత్యేక పూజలు, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

22న సర్వసభ్య సమావేశం

ఎచ్చెర్ల: లావేరు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 22వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.వెంకటరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరవ్వాలని కోరారు.

విద్యార్థులతో కూటమి ప్రభుత్వం చెలగాటం



జి.సిగడాం: కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంతవరకు నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చాక పథకాలు పేరు ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. పది నెలలు అవుతున్నా ఇంతవరకు ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంక్షేమ పథకాల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మరమ్మతులు చేపట్టరూ..?



కింతలిమిల్లు సమీపంలో పాడైన కంచె

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై డివైడర్ల మధ్యలో ప్రమాదాలు జరగకుండా ఐరన్ గ్రిల్స్ (ఇనుప కంచె) ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల జరిగిన ప్రమాదాల్లో అతివేగంగా వెళ్లే వాహనాలు ఢీకొట్టడంతో గ్రిల్స్ విరిగిపోయాయి. దీంతో వాటి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ఘన జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి బూరాడ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బాతువ గ్రామంలో ఘన జీవామృతం బుధవారం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు లభించే సహజ వనరులను వినియోగించి వివిధ రకాల ద్రావణాలు, కషాయాలు తయారు చేసుకుంటే సుస్థిర వ్యవసాయంతో పాటు సురక్షిత ఆరోగ్యం సాధించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, వావిలాకు కషాయం, తూటికాడ కషాయం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, మారేడుపత్రం కషాయాలను తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో సువ్వాడ సంతోష్ కుమారి, ఎస్.రాజేష్, ఎ.శివ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కె.ఆర్.రజిని సూచించారు. వర్సిటీ ప్రధాన సెమినార్ హాల్‌లో పోలీస్ శాఖతో కలిసి సంకల్పం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకొని ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్ వలన జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ నివారణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. విద్యా సంస్థల్లో శతశాతం నియంత్రణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. యాంటీ డ్రగ్స్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో ఉన్న కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ తరగతుల్లో ప్రవేశాలకు అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.సుధారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం సైతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనాథ, బడిబయట ఉన్న పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ వస్తుందన్నారు.

రణస్థలం: మండలంలోని లంకపేట కేజీబీవీలో 6, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.హైమావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన బాలికలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న జెమ్స్ యాజమాన్యం

శ్రీకాకుళం రూరల్ ఇటీవల ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో జెమ్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని జెమ్స్ యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. టేబుల్ టెన్నిస్ విభాగంలో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. వీరికి యాజమాన్యం అభినందనలు తెలిపింది.

నిరీక్షణ..



రైల్వే క్రాసింగ్ గేటు వద్ద ప్రయాణికుల నిరీక్షణ

పొందూరు: మండలంలోని లైదాం గ్రామం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. పొందూరు నుంచి సంతకవిటి, గోకర్ణపల్లి, వాల్తేరు, కావలి, అప్పలఅగ్రహారం, మంతిన, మండాకురిటి, సిరిపురం, లైదాం, తుంగపేట, గోరింట, తాడివలస తదితర గ్రామాలకు ఈ రైల్వే క్రాసింగ్ ద్వారానే ప్రయాణించాల్సి ఉంది. ఇక్కడ రైల్వే క్రాసింగ్ గేట్‌ను గార్డ్ గంటల సమయంపాటు వేసి ఉంచేస్తుండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. చిన్నారుల, బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగులు విధులకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సకాలంలో వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ రైల్వే క్రాసింగ్ గేట్‌కు బదులు ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, లేకపోతే యూటీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ఈ సమస్య దృష్టి సారించాలని ప్రయాణికులు విన్నవిస్తున్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన



టీకా ప్రక్రియను పరిశీలిస్తున్న డాక్టర్ కరుణాకర్

మెళియాపుట్టి: నాలుగు నెలల వయసు దాటిన ప్రతీ పశువుకు గాలి కుంటు వ్యాధి టీకాలను వేస్తున్నామని పాతపట్నం సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకర్ తెలిపారు. బుధవారం ముక్తాపురంలో టీకా ప్రక్రియను పరిశీలించారు. గాలికుంటు వ్యాధి పాల ఉత్పత్తిని తగ్గించి పాడిరైతుకు నష్టాన్ని మిగుల్చుతుందన్నారు. పశువులు అనారోగ్యాల పాలు కాకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు టీకా ప్రక్రియ జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా అన్ని పశువులకు టీకాలు వేస్తామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



సప్తాహంలో పాల్గొన్న ఆధ్యాత్మికవేత్తలు

నరసన్నపేట: నిత్యం భగవత్ పారాయణంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆధ్యాత్మికవేత్తలు శిష్టు శారది నాయుడు, కంచరాన గోపాలరావు అన్నారు. మండలంలోని ముద్దాడపేట రామ మందిరంలో మద్భాగవత సప్తాహ మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రారంభోపన్యాసం చేసిన వీరు భగవత పారాయణాన్ని ప్రతీ ఒక్కరూ చేయాలన్నారు. భక్తి మార్గం ఆచరణీయమని, ప్రతి ఒక్కరూ దైవ నామస్మరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమం బంకుపల్లి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మిక వేత్తలు తమ్మినాన కుర్మయ్య, కుశరాజు, సాంబమూర్తి, దివ్వల నాగేశ్వరరావు పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

ఎట్టకేలకు జీతాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని వివిధ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మ్యాన్‌ల రెండు నెలల జీతాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 2025 జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన జీతాలను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు డీఈవో డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య బుధవారం తెలిపారు. వెంటనే వారి బ్యాంకు ఖాతాలు సరిచూసుకునేలా హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలన్నారు.